# నరుడికోరిక

గరిమెళ్ళ విశ్వనాథం

"ఏవయ్యా! ఇరవయి నాల్గుగంటలూ ఆ పద్దు పుస్తకాలు ముందేసుకుని కూర్చునకపోతే నువ్వూ ఏదైనా అదృష్టానికి మార్గం ఆలోచించకూడదూ."

రంగనాయకుల్ని నిలదీసింది భార్య గజలక్ష్మి గుమ్మం దగ్గర నుంచుని.

సూచన లేకుండా సుడిగాలిలా, పెనుతుఫానులా వచ్చిన గజలక్ష్మి కర్ణకఠోర వాగ్ధాటికి ప్రళయ ప్రభంజన తాకిడికి వూగిపోతున్న సరుగుడు చెట్టులా రెపరెప లాడిపోయాడు రంగనాయకులు. క్షణకాలం నిశ్చేష్టత ఆవహించినా, తమాయించుకుని అటు చూశాడు.

"ఏ విషయం నువ్వు మాట్లాడుతున్నావో, అర్థం కావటంలేదు" విస్నగా శబ్దం వెలువడింది రంగనాయకులి గొంతు నుంచి.

"మరీ నంగనాచిలా మాట్లాడకు. నేను మాట్లాడేది మన పక్కింటి గుడిశలో వుంటున్న వెంకటి గురించే" గట్టిగా వురిమింది గజలక్ష్మి.

రంగనాయకులి ది వంశపారంపర్యగా వస్తున్న వడ్డీ వ్యాపారం. ధనాశకు లోబడి, డబ్బుకి డబ్బుకి లంకె పెడుతూ తండ్రి తన స్నేహితుడి కూతురు గజలక్ష్మితో రంగనాయకులి వివాహం చేశాడు.

గజలక్ష్మిది సార్థక నామం. మదపుటేనుగులా మాంఛి ఒడ్డూ, పొడుగూ, నల్లని దేహచ్ఛాయతో మెరుస్తూ వుంటుంది. కోపం వచ్చినప్పుడు రూపాయకాసంత బొట్టుతో, ఒంటిరాయి ముక్కుపుడకతో రుద్రకాళిని మరిపింపజేస్తూ కన్పిస్తుంది. రంగనాయకులు ఆమెలో సగం వుంటాడు. గజలక్ష్మికి కోపంవస్తే రెపరెపలాడిపోతాడు రంగనాయకులు. అవసరం వస్తే కళ్ళమ్మట నిప్పులు కురిపిస్తూ ప్రళయ తాండవం చెయ్యగలదు గజలక్ష్మి!

"ఓ అదా! వెంకడికి ఈ మధ్య ఏదో అదృష్టం కలసి వచ్చిందని విన్నాను. పూర్తి వివరాలు తెలియవునాకు."

"మతిలేకపోతేసరి. మన యింటి పక్కని వున్న మనిషి గురించి మూడో మనిషి ద్వారా వినటం కంటే యింకో మూర్ఖత్వంలేదు." గజలక్ష్మి కళ్ళలో చింతనిప్పులు కురిశాయి.

యిరవయి సంవత్సరాల సంసార యాత్రలో గజలక్ష్మిని యిటువంటి పరిస్థితుల్లో చాలా సార్లు చూశాడు రంగనాయకులు. చీవాట్లు తింటూ కొద్దో గొప్పో అనుభవం సంపాదించాడు. గజలక్ష్మిని ఏవిధంగా ప్రసన్నం చేసుకోవాలో అర్థం చేసుకోడానికి నిరవధికంగా ప్రయత్నిస్తూ వుంటాడు. తోచిన కాడికి ఆచరిస్తూ వుంటాడు.




చేతులు నులుపుకుంటూ, దృష్టినేలమీదకి మరల్చి కుడికాలి బొటనవేలితో నేలమీద సున్నాలు చుడుతూ, గొంతు మెల్లగా విప్పాడు రంగనాయకులు.

"ఏమయింది గజం! నువ్వు చెప్పింది ఎప్పుడయినా కాదన్నానా. నువ్వు చెప్పిన ప్రకారం చేస్తేనే మనకు అన్నివిధాలా లాభం. నీ తెలివి తేటలు నాకన్నా వాడి. కాబట్టి నువ్వే అసలు విషయం, దాని తరుణోపాయం చెప్పిపుణ్యం కట్టుకో."

జడివాన వెలిసింది. సుడిగాలి మరుగయింది. గజలక్ష్మిలో కాస్తంత ప్రసన్నత ఆవరించింది. గొంతులో నుంచి శబ్ద రాక్షసి తప్పుకుంది.

"వెంకడికి జలదేవత వెండి, బంగారు గొడ్డళ్ళని ప్రసాదించింది."

"ఎలాగ?"


రంగనాయకుల్లో కూడా ఉత్సాహం పుంజుకుంది. గజలక్ష్మి వాక్కులో ఉచ్చారణధాటి పెరిగింది యిసుమంత. యింటి పక్కన గుడిసెలో వుంటున్న వెంకడు రోజూ అడవికెళ్ళి కర్రలు కొట్టి, అమ్ముతూ సంసారాన్ని పోషిస్తున్నాడు. అటువంటి వాడికీ పరిస్థితులు మారి సంసారం మెరుగు పడింది.

"నాల్గురోజుల క్రితం దాహం తీర్చుకోడానికి ఏటి దగ్గరకు వెళ్ళిన వెంకడి గొడ్డలి నీళ్ళలో జారిపడిపోయింది. తన కుటుంబ జీవనోపాధి, అక్షయ పాత్ర లాంటి పరికరం పోతే వెంకడు భోరున ఏడ్చేడట. వెంటనే జలదేవత ప్రత్యక్షమై బంగారు, వెండి గొడ్డళ్ళని ఒకనొకటిగా చూపిస్తూ తనవయితే తీసుకోమని వెంకడిని ఆదేశించిందట. వెంకడు ఆ వెండి, బంగారు గొడ్డళ్ళు తనవికావని, యినుపగొడ్డలిని చూపించినప్పుడు అదే తనదని చెప్పాడట. అందుకు జలదేవత ప్రసన్నమయి, వెంకడి సత్యసంధతకు మెచ్చి ఆమూడు గొడ్డళ్ళని ప్రసాదించిందట."

"ఓహో! అదా సంగతి! అదృష్టవంతుడు" ఏదో విషమ పరిస్థితికి కీలకం తెలిసిన అనుభూతి పొందాడు రంగనాయకులు.

"కాబట్టి నువ్వు కూడా ఏదో అటువంటి పనిచేసి జలదేవతని ప్రసన్నం చేసుకుని లాభం పొందాలి" ఆదేశించింది గజలక్ష్మి.

"కాని ఎలా గజం! వాడికి గొడ్డలితో బతుకు. మనది వడ్డీ వ్యాపారం. వాడికి గొడ్డలి జీవనోపాధి. అది పోయింది కాబట్టి వాడు ప్రాణం పోయినట్టుగా విలపించాడు. జలదేవతని ప్రత్యక్షం చేసుకున్నాడు" కాని మనది పద్దుపుస్తకాలతోపనికదా!"




"ఏమయినా నువ్వు జలదేవతని ప్రసన్నం చేసుకుని తీరాలి" గట్టిగా ఆదేశించింది గజలక్ష్మి. పైశాచిక నృత్యానికి గజలక్ష్మి కాళ్ళు చిన్నగా కంపించడం రంగనాయకులు గమనించాడు.

"పోనీ నేనుకూడా ఒక గొడ్డలిని ఏట్లో విసిరేసినా, అది మన జీవనాధారం

కాదు కాబట్టి నాకు ఒక్కసారిగా యేడ్పురాదు. ఏడ్చినట్లు నటించినా, జలదేవత ప్రత్యక్షం కావడం కల్ల. కాబట్టి గజం! దయవుంచి నన్ను యిలా యిరకాటంలో పెట్టకు.''

సముద్రంలో నిర్లిప్తమై వున్న బడబాగ్ని ఒక్కసారి బద్దలై ఉప్పెనలా పైకెగసినట్టు గజలక్ష్మిలో భద్రకాళి అవతారం విజృంభించింది. అగ్ని జ్వాలలు దూసుకువచ్చాయి కళ్ళ నుంచి. పూనకం వచ్చినట్టు ఉద్వేగంతో అటూ యిటూ వూగసాగింది.


రంగనాయకులికి పరిస్థితి పూర్తిగా అర్థమయింది. తను ఆమెకు దూరంగా పారిపోవాలి.

రంగనాయకులు ఒక్కసారిగా పరుగులంకించుకున్నాడు. గజలక్ష్మి వెంటబడింది.

కొంతసేపటి తరువాత వెనక్కి చూసిన రంగనాయకులికి గజలక్ష్మి అలసిపోయి నిలబడి సేదతీర్చుకోవటం కన్పించింది. ఇసుమంత జాలి కల్గినా తమాయించుకుని ముందుకి సాగిపోయాడు.

అలసి పోయిన రంగనాయకులు యేటి ఒడ్డున బండమీద సేదతీర్చుకోడానికి కూలబడ్డాడు.

విధి నిర్వహణలో పూర్తిగా మునిగివున్నట్టు యేట్లో నీరు నిశ్శబ్దంగా పారుతున్నాయి. చల్లగా, మెల్లగా వీస్తున్న గాలి తెమ్మెరల్లో అలసిపోయిన రంగనాయకులు ఎంత అనుభూతి పొందాడు. భూతలంలో స్వర్గం చవిచూస్తున్నాడు.





నిశ్శబ్దాన్ని చీలుస్తూ శబ్దం వచ్చింది.

నిర్మలం, నిశ్చలంగా వున్న నీట్లో చిన్నగా అలలు లేచి ఒడ్డుకి ప్రయాణించాయి.

రంగనాయకులు ఒక్కసారిగా వెనక్కి తిరిగి చూశాడు.

ప్రళయ ఝంఝా మారుతంలా ఒడలు జలదరింపజేసే రూపంలో గజలక్ష్మి వెనకనిలబడి వుంది.

గుండె ఝల్లు మంది రంగనాయకులికి.




గజలక్ష్మికళ్ళు జ్యోతుల్లా మెరుస్తున్నాయి.

రంగనాయకులు మృత్యుగహ్వరంలో ప్రవేశించబోతున్నట్టు భ్రాంతిచెందాడు.

కాని...

రంగనాయకులిని పట్టుకోవాలన్న ప్రయత్నంలో గజలక్ష్మి కాలుజారి యేట్లో పడిపోయింది.

భార్యవలన ఎన్ని యిక్కట్లకు గురి అయినా, యిరవయి సంవత్సరాలు గజలక్ష్మితో జీవితయాత్ర సాగించాడు రంగనాయకులు. తను నీట్లోకి దూకినా తను మునుగుతాడు గాని గజలక్ష్మిని రక్షించలేడు. ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది అయాచితంగా.

జలదేవత ప్రత్యక్షం!

''నరుడా ఏమి నీకోరిక?

'' నీ దుఃఖమునకు కారణమేమి.''

అమితమయిన ఆశ్చర్యం, సంభ్రమం కలిగాయి రంగనాయకులికి తను తలచుకోని విధంగా జలదేవత ప్రత్యక్షమయింది!

ముకుళిత హస్తాలతో జలదేవతని ప్రార్థించాడు.

''దేవి నా భార్య యేట్లో కాలు జారి పడిపోయింది. ఆమెను రక్షించగలిగే స్థితిలో నేను లేను. ఎంత గయ్యాళి అయినా మూడు ముళ్ళు వేసిన భార్య కదా.''

జలదేవత ఒక్క క్షణం మాయమయి తిరిగి ప్రత్యక్షమయింది. జలదేవత పక్కన హేమమాలిని నిలబడివుంది!

''ఈమేనా నీ భార్య'' ప్రశ్నించింది. జలదేవత.

''అవును ఈమే నా భార్య. ధన్యోస్మి నా భార్యను నాకు దయచేయండి.''

జలదేవత కోపోద్రిక్తత అయింది. ఎర్రటి రక్తపు మంటలు చిమ్మాయి శాంత భూయిష్టమయిన నయనాలలో.

''మూర్ఖుడి! నువ్వు సత్యసంధుడివి కావు. ఇది నిన్ను పరీక్ష చేయడానికి నేను చేసిన యోచన. నువ్వు నా కటాక్షానికి అర్హుడివి కావు.''

''మహాదేవతా, నన్ను మన్నించాలి. వెంకడి సత్య సంధతకు మెచ్చి తమరు వెండి, బంగారు, ఇనుపగొడ్డళ్ళని ప్రసాదించారు. అదేవిధంగా నేను హేమమాలిని నా భార్య కాదంటే, తమరు నాకు జయప్రదను చూపిస్తారు. ఆమెను కూడా కాదు అంటే నా నిజజీవితపు భార్యను చూపిస్తారు. ఆమెయే నా భార్య అన్న తరుణంలో నాకు హేమమాలినిని, జయప్రదను, గజలక్ష్మిని తమరు ప్రసాదిస్తారు. ఒక్క భార్యతోనే నేను వేగలేకుండా వున్నాను.

ముగ్గురి భార్యలతో నా జీవితం, దుర్భరం, నకరప్రాయం. కాబట్టి ఈ ముగ్గురి భార్యల అవస్థ నుండి తప్పించుకోడానికి ఈ అబద్ధం చెప్పవలసి వచ్చింది. ఓ మహాదేవతా! నన్నుమన్నించి. కరుణించాలి. నాకు ఒక భార్య చాలు.''

రంగనాయకులు ఒక్క క్షణం కళ్ళు మూసుకుని నమస్కరించాడు.

కళ్ళు తెరచి చూస్తే ఎవరూ కన్పించలేదు రంగనాయకులికి

జలదేవత మటుమాయమయింది.

గజలక్ష్మి పక్కన నిలబడి వుంది.

*